క్లుప్తంగా

నేడు శ్రీదండి పీఠాధిపతి చినజీయర్‌స్వామి రాక

తాడూరు: మండలంలోని పొల్మూరులో నూతన సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి బుధవారం శ్రీదండి పీఠాధిపతి చినజీయర్‌స్వామి హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యుడు బాల్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ధాన్యాభిషేకం, జలాభిషేకం, వివిధ పూజలను నిర్వహించారు.

రేపు గుజరాత్ ముఖ్యమంత్రి రాక

నాగర్‌కర్నూల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ఈనెల 25న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారని బీజేపీ పార్లమెంట్ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ జక్కారఘునందన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రబాయ్ పటేల్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం స్థానిక బస్ డిపో నుంచి బస్టాండ్ వరకు విజయ సంకల్ప ప్రజా గర్జన యాత్ర కొనసాగుతుందని, బస్టాండ్ సెంటర్‌లో సభ నిర్వహిస్తునట్లు తెలిపారు.

కూలిన టెంట్



బిజినేపల్లి: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన జాతర సభలో టెంట్ కూలింది. అప్పటికే సభ ప్రాంగణానికి ఎవరు చేరుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం గాలుల ధాటికి టెంట్ కూలినట్లు నాయకులు పేర్కొన్నారు. కొద్దిసేపటికి టెంట్‌ను సరిచేశారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యం ఘటనలో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి ఈ నెల 22న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో మంగళవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కొల్లాపూర్, వివిధ వాహనాలలో బయలుదేరారు. అంతకు ముందు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మల్లురవికి అనుకూలంగా నినాదాలు చేశారు. చారకొండ, పెంట్లవెల్లి, వెల్దండ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నరిసంహయాదవ్, మోతిలాల్‌నాయక్ ఉన్నారు.

అనారోగ్యంతో బాలింత మృతి

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన బాలింత దాసర్ల కల్పన (27) అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నెల రోజుల కిందట కల్వకుర్తి ఆస్పత్రిలో కల్పన ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనారోగ్యంతో బాధపడుతుండటంతో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త వెంకటేష్ , సంవత్సరం పాప, నెల రోజుల పసి ఆడ శిశువు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకుడు శేఖర్ రెడ్డి పరామర్శించారు.

పోలింగ్ కేంద్రం మార్పిడి

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఉన్న 130 పోలింగ్ కేంద్రాన్ని జేపల్లికి మార్చినట్లు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. జేపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్లపల్లి, దొంగలగట్టు తండా, నేమలిగుట్ట తండా ఓటర్ల సౌకర్యార్థం కోసం పోలింగ్ కేంద్రాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని కల్వకుర్తి నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు 7, అచ్చంపేట్ నియోజకవర్గ కేంద్రాలు 14 ఉన్నాయని వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన దండు పెద్ద నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతపల్లి జగదీశ్వర్‌రావు రూ.5 వేలు సమకూర్చారు. ఈమేరకు కాంగ్రెస్ గ్రామ నాయకుడు బత్తుల కుర్మయ్య బాధిత కుటుంబానికి నగదు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతిని నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో లక్ష తమలపాకుల పూజలు చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజి సింగ్, శ్రీశైలం, స్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ఎదురుగా ఉన్న హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జై హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు వెంకటరమణ, సంబు శోభ, సత్యనారాయణ పద్మజా, గోపాల్‌రెడ్డి, జయమ్మ ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంతో పాటు అంబట్‌పల్లి, శాయిన్‌పేట, కోమటికుంట, వల్లబాపూర్, బాకారం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమాన్ విగ్రహాలను సింధూరంతో, తమలపాకులు, పూలతో అలంకరించారు.

ఊర్కొండ: మండలంలోని ఊరుకొండపేటలో అర్చకుడు దత్తాత్రేయ శర్మ ఇంటి నుంచి పబ్బతి ఆంజనేయస్వామి ప్రతిమ పటాన్ని వాహనంపై ఊరేగించారు. గ్రామం వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. ఆలయంలో ఆంజనేయ స్వామి హోమం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



లింగాల మండలం శాయిన్‌పేటలో ..

దేవాలయ ఈఓ సూర్య చంద్రరెడ్డి, మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు మనోహర్ రెడ్డి, నర్సి రెడ్డి, రమేష్ నాయక్, అంజయ్య, అశోక్, మల్లేష్, నాయకులు వహిదోద్దీన్, రవీందర్ సాగర్, రవీందర్ గౌడ్, శ్రీనివాసులు, ఆంజనేయులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, రాచూర్, తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మల బాలఫీరు, రామకృష్ణ, పర్వతాలు, రాంచరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో పూజల్లో పాల్గొన్న మహిళలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శ్రీరామ యువజన సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో కొనసాగింది. చెక్కభజన అందరిని ఆకట్టుకుంది.

చారకొండ: మండల కేంద్రంలో యూత్ ఆధ్యర్యంలో హనుమాన్ జెండాలను ఏర్పాటు చేశారు. పురవీధుల గుండా ర్యాలీ తీశారు. యువకులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో గుండె శివ, రామకృష్ణ, కిరణ్, గణేష్, వినయ్, సాయితేజ్, సాత్విక్ తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మన్ననూరులో..



ఊర్కొండపేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కోడేరులో..



చారకొండలో..

వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలు



మన్ననూర్: వన్యప్రాణుల పరిరక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని మన్ననూర్ ఎఫ్ఆర్‌ఓ ఈశ్వర్ తెలిపారు. సలేశ్వరం ఉత్సవాల సందర్భంగా వన్య ప్రాణుల రక్షణ కోసం పరిసర ప్రాంతాల్లో అధికారులు సిబ్బంది గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 120 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా అదనంగా 100 మంది వలంటీర్లను నియమించామన్నారు. వన్య ప్రాణులకు హానికలిగే ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. భక్తులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి



తెలకపల్లి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మంగళవారం మండలకేంద్రతో పాటు కార్వంగ అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీలో అందుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, అక్బరీ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

కల్వకుర్తిరూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఉపాధ్యాయుడు రమేష్, కిషన్, పాఠశాల హెచ్ఎం రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను, నీతి కథల పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం శేఖర్, వెంకట్రాజు, శ్రీను, పరుషరాం, ఏ.శ్రీను, అశ్రఫ్, అరవిందు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయంలో వివిధ రకాల బాల సాహిత్య పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సామ్యానాయక్, ఉపాధ్యాయులు శంకరయ్య, శ్రీశైలం, జయమ్మ, వెంకటేష్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కల్వకుర్తి మండలం ఎల్లికల్‌లో పుస్తకాలు అందిస్తున్న కల్మిచర్ల రమేష్

ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుల నిరసన

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) జిల్లా నాయకుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కార్మికులకు ఆర్‌పీఎస్ 2013కు సంబంధించిన బాండు డబ్బులు రూ. 281 కోట్లు విడుదల చేస్తామని ఫిబ్రవరి 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినా నేటికీ బాండు డబ్బులు చెల్లించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడు గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాడుతామని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు మధు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ముందు డిమాండ్స్ డే సందర్భంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేటలో గేటు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా వార్షిక దినోత్సవం నిర్వహించారు. గురుకుల పాఠశాలకు ఎంపికై న విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ పాత్కుల సైదమ్మ రామచంద్రయ్య రూ. 8 వేలు, ఎంపీఓ నారాయణ రూ. 2 వేలు ఆర్థికసాయం పంపిణీ చేశారు. అదేవిధంగా తరగతి వారిగా విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు మెమెంటోలను అందజేశారు. నాయకులు అనంతరెడ్డి, పాఠశాల ఎఎపీసీ చైర్‌పర్సన్ ఆలూరి అరుణ, పాత్కుల రామచంద్రయ్య, నినిరంజన్, హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, శ్రీనివాసులు, వెంకటేష్, పద్మావతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-3లో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అదేవిధంగా మూడేళ్ల దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్లేశ్వరం ప్రాథమిక పాఠశాలలో బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం ప్రాథమిక పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. విద్యా సంవత్సరం చివరి రోజు కావడంతో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఆడి పాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విజేందర్‌సింగ్, రమేష్, రామచంద్రనాయుడు, రోశయ్య, సుంకులయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గీతా కార్మికుల సమస్యలు పరిష్కారం



మల్లు రవిని శాలువాతో సత్కరిస్తున్న గౌడ సంఘం రాష్ట్ర నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్‌తోనే గీతా కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని, పార్లమెంట్ ఎన్నికల్లో గీతాకార్మికుల జీవన విధానాలు, స్థితిగతులు తెలిసిన నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర కల్లుగీత సహకార సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజు గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతున్న మల్లురవికి అందరు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం రాష్ట్ర కమిటీ కన్వీనర్ ఆయిలి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ గీతా కార్మికులు చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎంపీ అభ్యర్థి మల్లురవిని గౌడ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎల్లికట్ట విజయ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పకీరయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డా మల్లురవిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంగ్లభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ మాట్లాడుతూ మాతృభాషతో పాటు, ఆంగ్లభాషలో కూడా ప్రావీణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మౌనిక, వెంకటయ్య, రమేష్‌కుమార్, కురుమయ్య, స్వామిసాగర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

రియల్‌ఎస్టేట్ సంఘం ఎన్నిక

కల్వకుర్తి: రియల్ ఎస్టేట్ సంఘం నియోజకవర్గ కమిటీని మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా బండారి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడిగా వెన్న చంద్రమోహన్, ఉపాధ్యక్షుడిగా బాదేపల్లి కృష్ణయ్య గౌడ్, రవీందర్, వాహెద్, శ్రీనివాసులు, జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా సర్దార్, కోశాధికారి సూరాని శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

సైబర్‌నేరాలపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. కొత్త వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. సోషల్ మీడియాలో పరిచయం లేనివారితో చాటింగ్‌లు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వీకే ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్చాలలో కంటి వైద్య శిబిరం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో మంగళవారం వీరభద్ర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యుడు వీరభద్ర మాట్లాడుతూ కళ్ల ఆరోగ్యం కోసం తాజా ఆకుకూరలు, విటమిన్ ఏ ఉన్న ఆహారాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కూలీలకు తాగునీటి వసతి

ఊర్కొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు తాగునీటి వసతి కల్పిస్తునట్లు ఎంపీడీఓ విజయ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేసే ప్రదేశాల వద్ద ప్రథమ చికిత్స కిట్లు, ఎండదెబ్బకు గురవకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమణి, ఎంపీఓ వెంకటేశ్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం అభివృద్ధికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన విమాన రథోత్సవం(పెద్దతేరు) వేడుకలు మంగళవారం తెల్లవారు జామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి రథాన్ని లాగారు. రథాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. మహిళల కోలాటాలు, భజన కీర్తనలతో ఆకట్టుకున్నారు. దాదాపుగా 7 గంటల పాటు కొనసాగిన రథయాత్రకు మహిళలు మంగళహారతులు పట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, పూజారి వెంకటయ్య, బాలాజీ, పరమేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు గద్దమయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి మంగళవారం బాధితులను పరామర్శించారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన చిరువ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం బాల్‌నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఘటన స్థలాన్ని ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ ఆనంద్‌జీ, నర్సింహ, కృష్ణాజీ, శేఖర్, వెంకటయ్య, తన్నీరు మల్లయ్య పాల్గొన్నారు.

మైలారం గుట్టపై మైనింగ్ ఆర్ఐ విచారణ



బల్మూర్: మండలంలోని మైలారంలో మంగళవారం మైనింగ్ శాఖ ఆర్ఐ నాగ చైతన్య విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ గ్రామాన్ని అనుసరించుకొని గుట్టపై ఉన్న ఇళ్ల వివరాలు, గ్రామస్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గుట్టపై తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని ఇటీవల గ్రామస్తులు ఆర్ఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాన్ని సందర్శించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. రెవెన్యూ ఆర్ఐ శివ, సర్వేయర్ జనార్దన్ ఉన్నారు.

మామిడి చెట్లు దగ్ధం

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ గ్రామ శివారులో మంగళవారం రైతు తూముకుంట ప్రభాకర్‌రెడ్డి చెందిన మామిడి తోటకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని 40 చెట్లకు పైగా కాలిపోయాయి. దాదాపు రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీహైస్కూల్ విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు మహనీయుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. క్లబ్ డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కాశీపురం మహేష్, మహిళా అధ్యక్షురాలు చిత్తనూరు శ్రీదేవి, కోశాధికారి సోమిశెట్టి రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి భీమయ్య, హెచ్ఎం శోభారాణితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం



కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మంగళవారం 7వ వార్డు కమిటీ అధ్యక్షుడు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నేరటి మల్లేష్, బాలరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని దళిత సేన జాతీయ అధ్యక్షుడు రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర దళితసేన జనరల్ సెక్రటరీ చెన్నయ్య, జాతీయ ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం అధ్యక్షుడు రాజేందర్, ఎల్లస్వామి, కుసుమ, యాదమ్మ, వంకేశ్వరం లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు